

రెప్పల మీద నీడలు

– అత్తలూరి విజయలక్ష్మి



(గత సంచిక తరువాయి)

17

పవిత్ర నెల తప్పింది. ఈ విషయం వెంకటమ్మ చెప్పగానే, పవిత్ర మనసులో చెలరేగుతున్న ఎన్నో ఆలోచనలు, శివ మీద కలుగుతున్న అనుమానాలు, సరళ పట్ల ఉన్న భయాలు పటా పంచలయాయి. సిగ్గుతో ముడుచుకుపోయింది.

రెండు చేతులతో మొహం కప్పుకుని, వ్రేళ్ళ సందునుంచి వెంకటమ్మని చూస్తూ "నిజమా?" అని అడిగింది.

వెంకటమ్మ జాలిగా చూసింది. ఈ చిన్నపిల్ల ప్రేమ, పెళ్లి అనే ఒక పెద్ద వలలో చిక్కుకుంది. ఆ వల నుంచి ఈ పిల్లని ఎలా బయటపడేయాలా అని ఆలోచిస్తున్న తరుణంలో గోరు చుట్టు మీద రోకటి పోటులా ఈ అమ్మాయి అప్పుడే నెల తప్పింది. ఇంక ఈమె భవిష్యత్తు ఏమిటి? ఎలా ఉంటుంది? ఆ డాక్టర్ ఈ గర్భాన్ని ఉంచుతాడా? ఆమెకి భయం వేసింది.

తన భయం కనిపించనీయకుండా, పవిత్ర భుజం పట్టుకుని గదిలోకి నడిపిస్తూ అంది. "అవునమ్మా. మీకు వేవిళ్ళు మొదలైనాయి. అందుకే ఈ కక్కులు. ఇట్టా పడుకోండి... నిమ్మకాయ నీళ్ళు కలిపి తెస్తాను." అని చెప్పి పవిత్రని మంచం మీదకి చేర్చి, తను వంట గదిలోకి వెళ్ళింది.

పవిత్ర దిండు నానుకుని ఒదిగి పడుకుంది.

వెంకటమ్మ స్వరం చెవిలో ఒక నాదం ఊదినట్టు ప్రతిధ్వనించసాగింది.

ఆమె చెప్పింది నిజమేనా? తను...తను తల్లి కాబోతోందా? ఒళ్లంతా ఝల్లుమంది.

శివకి ఈ విషయం చెబితే ఎలా స్పందిస్తాడో! తనని ఎత్తుకుని గిరగిరా తిప్పేసి, వెంటనే వెళ్లి తనకి ఇష్టమైన ఐస్ క్రీం తీసుకురాడూ! శివకి పాప కావాలో, బాబో అడగాలి. తనకి బాబు కావాలి. చిన్నప్పటి నుంచీ ఒక తమ్ముడుంటే బాగుండు అని ఉండేది. తమ్ముడు కోసం తపించింది. అన్న, అక్క, చెల్లి, తమ్ముడు ఎవరూ లేరు. ఒంటికాయ శొంటి కొమ్ము. తనకి బాబు పుడితే ఎంత బాగుంటుంది! వాడే కొడుకు, వాడే అన్న, వాడే తమ్ముడుగా తన జీవితంలోకి ప్రవేశిస్తాడు.

నరనరం తీయగా పులకించింది. ఒక బుజ్జిబాబు పుట్టబోతున్నాడా? పొట్ట మీద చేయి వేసి తడుముకుంది.

శివ... ఆమె ఒళ్ళు ఝల్లుమంది. ఇంత త్వరగా తనని తల్లిని చేసిన శివకి ఏమివ్వాలి? ఏదన్నా గిఫ్ట్ ఇవ్వాలి.

"నువ్వు నాకిచ్చే గిఫ్ట్ పాపాయి... ఇంకా నాకు ఏం కావాలోయ్? నేనే ఇస్తా నీకు...."

శివ స్వరం వినిపించింది.

తుళ్ళిపడింది.

ఎప్పుడెప్పుడు ఈ శుభవార్త శివ చెవిలో వేయాలా అనిపించసాగింది. శివ ఎప్పుడు వస్తాడో! ఆవిడతో వెళ్ళాడు. మహాతల్లి ఎక్కడికి తీసుకువెళ్లిందో!

ఒక్కమాట కూడా చెప్పలేదు తనకి. ఆవిడ చెప్పకపోతే పోనీ, శివ తన భర్త. తనకి చెప్పకుండా ఆవిడని ఎక్కడికో తీసుకువెళ్ళడం ఏమిటి? పైగా వెకిలి నవ్వు ఒకటి. సాయంత్రం దాకా నిద్రపో అని చెప్పింది వెకిలిగా నవ్వుతూ.

ఇంతకుముందు అందంగా అనిపించిన సరళ ఇప్పుడెందుకో రోతగా అనిపిస్తోంది. ఆవిడని తలచుకోగానే ఒక విధమైన జుగుప్స కలుగుతోంది.

అసలీవిడ ఎవరు ? నిజంగా శివకి పిన్ని కాదా? పిన్ని అయితే, వెంకటమ్మ చెప్పిన సంబంధం ఎలా ఉంటుంది? దరిద్రం కదా!

పవిత్ర భయంతో వణికింది. లేదు, లేదు అలాంటి సంబంధం లేదు వాళ్ళ మధ్య. పిన్నితో చనువుగా ఉండకూడదా? తను నానమ్మతో ఎలా ఉండేది? కోపం వస్తే అరిచేది... ఏదన్నా కావాలంటే మంకుపట్టు పట్టేది. సినిమాలు నానమ్మతోటేగా ఎక్కువ చూసేది.

ఇలా జరక్కూడదు దేవుడా! ఇలా జరక్కూడదు అనుకుంది మనసులో.

నాంచారమ్మ గుర్తు రాగానే గుండె బరువెక్కింది. ఆవిడకి, అమ్మకి, నాన్నకి ఈ శుభవార్త ఎలా చెప్పడం? ఒక ఉత్తరం రాయాలి. శివ రాగానే కార్డు అన్నా, కవర్ అన్నా తీసుకురమ్మని చెప్పి, ఉత్తరం రాసి, పోస్తే చేయాలి.

ఈ వార్త తెలియగానే నానమ్మ ఎంత సంతోషిస్తుంది! ఎగురుకుంటూ వచ్చేస్తుంది. తనని కాలు కిందపెట్టనివ్వదు. ఎంతో ప్రేమగా చూసుకుంటుంది. తనకిష్టమైన కందిపచ్చడి, మినపరొట్టే , అందులో నంచుకోడానికి మాగాయలో పెరుగు వేసి ఎంత బాగా పోపు పెడుతుంది.

మినపరొట్టే తలచుకోగానే పవిత్రకి నాంచారమ్మ బాగా గుర్తుకు వచ్చి, కన్నీళ్లు వచ్చాయి.

వెంకటమ్మ నిమ్మకాయ, షర్బత్ తో వచ్చింది.

"లేచి కూర్చుని ఇది తాగమ్మా! " అంది ఆప్యాయంగా.

పవిత్ర తలగడ మీద నుంచి లేచి, కాళ్ళు కిందకి పెట్టుకుని మంచం మీద కూర్చుని, గ్లాసు అందుకుంది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నారు?" పవిత్ర చెక్కిళ్ళ మీద ధార కట్టిన కన్నీరు చూసి సానుభూతిగా అడిగింది.

"ఏమి లేదు వెంకటమ్మా! మా నానమ్మ గుర్తుకు వచ్చింది. నానమ్మ చేసి పెట్టిన మినపరొట్టే గుర్తుకు వచ్చింది. మా నానమ్మ మినపరొట్టే ఎంత బాగాచేస్తుందో తెలుసా? నానమ్మ కాల్చినట్టు అమ్మకి కూడా రాదు. ఒక మూకుడు ఉంటుంది. తమాషాగా ఉంటుంది. అది నానమ్మకి వాళ్ళ అత్తగారు ఇచ్చారుట. అది కంచు మూకుడు అనేది నానమ్మ. దానిలో మినప రొట్టె మాత్రమే చేస్తారుట. ఇంక దేనికీ వాడేది కాదు." నెమ్మదిగా షర్బత్ తాగుతూ చెప్పింది పవిత్ర.

వెంకటమ్మకి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు. తనకి దారిలేదు మెడకో డోలు అన్నారట ఎవరో. ఈ పిల్ల బతుకే దారీ తెన్నూ కనపడడం లేదు. ఆ ఎదవ ఎన్నాల్లు కాపురం చేస్తాడో, ఎప్పుడు వదిలేస్తాడో తెలియదు. ఆ సరళ దెయ్యం వదిలితే గానీ, ఈ పిల్ల బతుకు బాగుపడదు. దేవుడా! ఈ అమాయకురాలిని నువ్వే కాపాడాల" అనుకుంది మనసులోనే దణ్ణం పెట్టుకుంటూ.

"వెంకటమ్మా! నువ్వు చెప్పిన విషయం, నిజమేనా? అప్పుడే నెల తప్పుతారా?" అమాయకంగా అడిగింది పవిత్ర.

ఆమె నవ్వింది. "మీకు నెలసరి ఎప్పుడు? ఇక్కడికి వచ్చాక బయటున్నారా?" అని అడిగింది.

పవిత్ర ఆలోచించింది. నిజమే! పెళ్ళికి వారం ముందే తనకి పీరియడ్స్ వచ్చింది. మళ్ళీ రాలా. వేళ్ళతో లెక్క పెట్టింది. ఆరోజుకి పెళ్లి అయి సరిగ్గా నెల. మరునాడే ఇక్కడికి వచ్చారు. వెంటనే... ఆమె చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. వెంకటమ్మ మొహంలోకి చూడడానికి సిగ్గేసి తల దించుకుంది.

అనుభవజ్ఞురాలు అయిన వెంకటమ్మ సిగ్గుతో ఎర్రబడిన పవిత్ర చెక్కిళ్ళు నిమిరి అంది. "నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్ల వాడమ్మా. నా చెల్లెలుకి ఇద్దరు పిల్లలు. తమ్ముడికి ఇద్దరు పిల్లలు. అందరి పురుళ్ళు, పుణ్యాలు చూసిన దాన్ని. నాకు తెలియదా? డాక్టర్ దగ్గరకు ఎల్లండి కానీ, మీరు గర్భవతి అయినది నిజమే!"

కచ్చితంగా చెబుతున్న వెంకటమ్మ వైపు చూసి, మధురంగా నవ్వి ఆఖరి చుక్క గొంతులో పోసుకుని, గ్లాసు ఆమె చేతికి ఇచ్చింది.

గ్లాసు అందుకుని అంది ఆమె." డాక్టర్ బాబుగారు రాగానే ఈ సుబవార్త చెప్పి, ఆయన్ని ఆకట్టుకోండి. ఈ వంకతో అయినా ఆయన మారితే మీరు సుకంగా ఉంటారు. మీరు కొంచెం గడుసుదనం నేర్చుకోవాలి తల్లీ."

"అంటే!"

వెంకటమ్మ మనసులోనే నెత్తి కొట్టుకుంది. "భర్తను కొంగుకు కట్టేసుకునే గడుసుదనం"అంది.

పవిత్ర మాట్లాడలేదు. వెంకటమ్మ మనసులో అనుకుంది. ఈ అమ్మాయికి ఇంకా కొన్ని రోజులు పోతే గానీ ఆ గడుసుదనం రాదు. అంతవరకు చెబుతూనే ఉండాలి.

"సరేనమ్మా! నేను ఇంకో ఇంట్లో పనికెల్లాలి. మీకు వంట చేయడం రాదేమో! నేను చేస్తే తింటారా? చేసి ఎల్లనా?"

"ఒద్దు. నేను చేసుకుంటా. నువ్వు వెళ్ళు. సాయంత్రం వస్తావుగా. వీళ్ళు ఎన్ని గంటలకి వస్తారో తెలియదు." అంది పవిత్ర.

"నాలుగింటికి వచ్చేస్తానమ్మా. మీరు భోజనం చేసి, పడుకోండి. నేనొచ్చి, అంతా శుభ్రం చేస్తాను. మీరు వంట తప్ప ఏమి చేయకండి." చెప్పేసి వెళ్ళిపోయింది వెంకటమ్మ.

పవిత్రకి ఆమె గుమ్మం దాటగానే దిగులు కమ్మేసింది. ఆమె ఉన్నంత సేపూ చాలా ధైర్యంగా, ఎంతో భద్రంగా అనిపిస్తుంది. అమ్మ దగ్గర ఉన్నట్టు ఉంటుంది. ఒంటరిగా మిగిలిపోవడంతో కొంచెం భయం వేసింది.

వీళ్ళు ఎన్ని గంటలకి వస్తారో! వెంకటమ్మ చెప్పినట్టు సరళని శివతో తిరగనివ్వకూడదు. శివ తనవాడు. తన సొంతం. తన భర్త. అతని మీద తనకి సర్వ హక్కులున్నాయి. అతనితో పాటు తిరిగే అధికారం తనకుంది. మధ్యలో ఆవిడెవరు తనని వద్దు అనడానికి. రేపు ఎట్టి పరిస్థితుల్లో వాళ్ళతో పాటు తనూ వెళ్ళాలి. ధృడంగా నిశ్చయించుకుంది.

వంట గదిలోకి వెళ్లి, కిచెన్ ప్లాట్ ఫారం మీద ఉన్న బుట్టలో నుంచి బంగాళా దుంపలు రెండు తీసుకుని, ఒక ఉల్లిపాయ తీసుకుని కట్ చేయడం మొదలు పెట్టింది.

కాసేపట్లో బంగాళా దుంప వేపుడు, చారు చేసుకుని, స్నానం చేసి, ఫ్రెష్ అయింది.

సరిగ్గా ఒంటి గంటకి అన్నం తినేసి, అలసటగా అనిపించి, మంచం మీద వాలింది.

ఆమెకి మెలకువ వచ్చేసరికి మూడు అవబోతోంది.

🦋🦋🦋

"పిల్ల వెళ్లి నెల కావస్తోంది. ఒక ఉత్తరం లేదు, ఒక కబురు లేదు. ఎల్లా ఉందో! ఒకసారి నువ్వన్నా వెళ్లి పిల్లని చూసి రాకూడదుట్రా? పుట్టిన దగ్గర నుంచి ఏనాడూ మనలని వదిలి ఉండలేదు. ఎలా ఉందో!" గొంతులో దుఃఖం అడ్డు పడుతోంటే చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ అంది నాంచారమ్మ ఆఫీస్ కి బయలుదేరుతున్న మాధవ తో.

వంట గదిలో ఉన్న వర్ధని అత్తగారి మాటకి ఆయన చెప్పే సమాధానం కోసం ఊపిరి బిగబట్టి చెవులు అప్పగించింది.

మాధవ మాట్లాడలేదు.

ఆయనకీ కూడా పవిత్ర మీద దిగులుగానే ఉంది. ఏనాడూ తమని వదిలి ఎక్కడికీ వెళ్ళని పిల్ల, తాళి కట్టిన మరునాడే అంత దూరం తీసుకుని వెళ్ళాడు అతను. పెళ్లి ముహూర్తాలు పెట్టుకున్నాక తనకి హైదరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ కి వేసారని చెప్పాడు. అది నిజమో, అబద్ధమో! కావాలనే తమకి పవిత్రని దూరం చేసాడా? ఆయనకీ శివ మీద సదభిప్రాయం కలగలేదు. ఇప్పుడు కూడా ఆయన అసంతృప్తి తోనే ఉన్నాడు. అతను డాక్టర్ అన్న అర్హత తప్ప తన స్థాయికి తూగే అర్హత ఏముంది? తల్లి,తండ్రి లేరు. ఆ పిన్ని దగ్గర వీళ్ళు ఉండరు వేరు కాపురమే పెట్టి ఉంటాడు. నా బిడ్డకి కాఫీ పెట్టడం కూడా సరిగా రాదు. ఎలా ఉందో! ఏం చేస్తోందా? ఆయన కళ్ళు చెమర్చాయి.

"వర్ధనీ! ఓ అరకప్పు కాఫీ ఇవ్వు" అన్నాడు భార్యకి వినిపించేలా.

నాంచారమ్మకి ఒళ్ళు మండింది. తన ప్రశ్నకి జవాబు చెప్పకుండా మాట దాటేస్తున్న కొడుకు వైపు చూసి, కోపంగా ఏదో అనబోయింది. ఇంతలోకి మాధవే అన్నాడు.

"వెళ్ళాలనే ఉంది. కానీ వెళ్ళగానే అడ్రెస్స్ పంపిస్తాను అన్నాడు అతను. ఇంతవరకు ఓ ఉత్తరం ముక్క రాయలేదు. ఎక్కడికి వెళ్ళను?" అన్నాడు.

నిజమే సుమా! అనుకుంది ఆవిడ. ఆ మాట అనుకున్నాక ఆవిడ శరీరం కంపించింది. ఇంతవరకు ఉత్తరం రాయకపోవడం అతని ఆంతర్యం ఏంటి? ఇలా తాళి కట్టి, అలా పిల్లని తీసుకుని వెళ్ళాడు. బాధ్యతా లేదా? అతను పోనీ డాక్టర్ కాబట్టి పని ఒత్తిడి లో ఉండి ఉంటాడు. ఆ పిన్ని, బాబాయ్ ఉన్నారు వాళ్లన్నా చెప్పకూడదూ! అసలు పవిత్రే రాయచ్చుగా.

"సీతకి తెలిసే ఉంటుంది. దాన్ని అడగకూడదూ! వాళ్ళ నాన్నకి ఫోన్ చేయి ఆఫీస్ కి వెళ్ళగానే" సలహా ఇచ్చింది.

"దాని మొహం. అది ఉన్నది ఒక్కరోజు. మొదటిసారి హైదరాబాద్ వెళ్ళింది. వచ్చింది. ఏం తెలుస్తుంది వాళ్ళు ఉన్నది ఏ ఏరియా నొ. చూద్దాం లే. గవర్నమెంట్ హాస్పిటల్ అన్నాడుగా. నా మిత్రుడు రాఘవ అని ఉన్నాడు హైదరాబాద్ లో వాడిని కనుక్కోమంటా." అన్నాడు వర్ధని ఇచ్చిన కాఫీ కప్పు అందుకుని.

వర్ధని కూడా మెల్లగా అంది. "పిల్ల మనలని వదిలి ఒక్క రోజు ఉండలేదు. ఎలా ఉందో, ఏమిటో!"

ఆయన మాట్లాడకుండా ఆలోచిస్తూ కాఫీ తాగసాగాడు.

నాంచారమ్మ కూడా తన ఆలోచనలో తనుండి పోయింది.

అది పుట్టిన దగ్గర నుంచి ఇంట్లో మహాలక్ష్మి పుట్టిందని ఎంతో గారాబంగా పెంచుకున్నాం. అన్నెం, పున్నెం ఎరుగని పిల్ల... నా తల్లి బంగారం. ఇరవై ఏళ్ళు లేవు. అప్పుడే పెళ్లి, భర్త, సంసారం. పెళ్లి చేయాలని అనుకుంది కానీ, పిల్ల ఇలా భర్తతో అంత దూరం వెళ్తుందని ఊహించలేదు. అసలా ఆలోచన కూడా రాలేదు.

అతనెలాంటి వాడో, నా తల్లిని ఎలా చూసుకుంటున్నాడో! పవిత్రని ప్రేమించాడు, పెళ్లి చేసుకుంటా అని చెప్పాడు. అన్నట్టుగానే చేసుకున్నాడు. తల్లి,తండ్రి లేని కుర్రాడు. కచ్చితంగా భార్యని ప్రేమగా చూసుకుంటాడు. కొంతమంది మగవాళ్ళు భార్యలో తల్లిని చూసుకుంటూ ప్రేమగా ఉంటారు. ఇతను కూడా పవిత్రని ప్రేమగా చూసుకుంటున్నాడెమో!

ఆవిడ ఆలోచనలు పరి,పరి విధాలుగా సాగుతోంటే, అక్కడ నుంచి లేచి, తన గదిలోకి వెళ్ళిపోయింది.

కాఫీ తాగడం పూర్తి చేసి ఖాళీ కప్పు వర్ధని చేతికి ఇచ్చి "సరే నేను వెళ్ళొస్తా "అన్నాడు మాధవ.

మాధవకి శివ నచ్చలేదని, పవిత్ర పట్టు పట్టడంచేతా, మోహన్ వలన జరిగిన రాద్ధాంతం వీదికి ఎక్కకూడదన్న ఆలోచన వల్లా, ఆ పిల్ల చదువు మాన్పించి, ఆదరా,బాదరాగా పెళ్లి చేసాడు భర్త అని వర్ధనికి తెలుసు.

పవిత్ర కాపురానికి అంత త్వరగా వెళ్తుందని, అదీ, దూరం వెళ్తుందని ఇంట్లో ఉన్న ముగ్గురూ ఊహించలేదు. అసలు ఆ ఆలోచన ఎవరికీ రాలేదు. పవిత్ర వెళ్ళాక, సీత తిరిగి వచ్చి, వాళ్ళు అక్కడ బాగా ఉన్నారని, ఇల్లు బాగుందని, తనకి చీర పెట్టారని చెప్పాక కొంచెం ఊపిరి పీల్చుకున్నారు.

అతని ఇంట్లో ఫోన్ ఉంటుందని, పవిత్ర ఫోన్ చేస్తుందని ఎదురు చూస్తున్నారు అందరూ. కానీ ఎలాంటి ఫోన్ కానీ, సమాచారం కానీ రాకపోవడంతో ముగ్గురి మనసులోనూ పవిత్ర ఎలా ఉందో అన్న దిగులు పేరుకుంటోంది. వర్ధని, నాంచారమ్మ మధ్య, మధ్య ఒకరినొకరు ప్రశ్నించుకుంటూ, వారికి వారే సమాధానం చెప్పుకుంటూ కొంత ఓదార్పు పొందుతున్నా, మాధవ మగవాడిగా ఎవరికీ చెప్పుకోలేక, ఏం చేయాలో తెలియక మనసులో కుమిలిపోతున్నాడు. ఆయన మనసు కీడు శంకిస్తోంటే, తప్పు, తప్పు అని తనని తానే హెచ్చరించుకుంటున్నాడు.

ఆఫీస్ లో అడుగు పెడుతూనే సీత తండ్రి జవహర్ కి ఫోన్ చేసాడు. కుశల ప్రశ్నలు అయ్యాక నెమ్మదిగా అడిగాడు. "జవహర్! సీతని మా పవిత్ర హైదరాబాద్ లో ఎక్కడ ఉంటోందో అడిగి చెప్తావా? పిల్ల దగ్గర నుంచి ఉత్తరం లేదు".

"అలాగా! తప్పకుండా అడిగి చెప్తాను బావగారూ! సాయంత్రం ఇంటికి వెళ్ళగానే ఫోన్ చేయిస్తాను. ఇప్పుడు ఆఫీస్ లో ఉన్నాను." అన్నాడు జవహర్.

సాయంత్రం వరకు అన్యమనస్కంగా గడిపాడు మాధవ. పార్ధసారధి విడిపోయాక వ్యాపారం కొంచెం నష్టాల్లోనే ఉంది. పైగా ఇప్పుడు చాల మంది యువకులు ఆర్కిటెక్చర్ చేసి, construction రంగంలోకి వచ్చారు. ఎంతో అభివృద్ధి చెందిన ఆధునిక, సాంకేతిక పద్ధతుల్లో, కొత్త మోడల్స్ ప్రకారం మోడరన్ గా కడుతున్నారు ఇల్లు. అంతేకాదు, జ్యోతిష్యులు చెప్పే వాస్తు మీద నమ్మకం పోయి, శాస్త్రపరంగా చదువుకున్న వారి సలహాలు తీసుకుంటున్నారు. వాస్తు ఒక శాస్త్రం అయింది. మాధవకి వాస్తు, జ్యోతిషం తెలిసినవారి గురించి తప్ప, ఒక సైన్సు లా చదువుకోడం తెలియదు. అందుకే వాళ్ళతో పోటీ పడలేకపోతున్నాడు.

మరొక కారణం ఉన్న ఒక్క ఆడపిల్ల పెళ్లి చేసేసాడు. ఆ పిల్లకి బోలెడు బంగారం ఇచ్చాడు. ఎవరికీ చెప్పలేదు కానీ పవిత్ర కోసం ఒక రెండు వందల గజాల స్థలం కూడా కొన్నాడు గుడివాడలో. అది ఆమె పేరున రాసి, రిజిస్టర్ చేయించేస్తే, ఉన్న దానిలో తనకి, భార్యకీ, తల్లికీ ఏ లోటూ లేకుండా గడిచిపోతుంది. ఆయనకి కోట్లు సంపాదించి, ఊళ్ళకి ఊళ్లు కోనేయాలి అనే ఆశ లేదు. అందుకోసం పరుగులు తీయడు. అన్యాయాలు చేయడు. ఇంతకాలం కేవలం పవిత్ర కోసం సంపాదించాడు. ఆ పిల్ల పెళ్లి మంచి అబ్బాయితో అంగరంగ వైభవంగా చేయాలి అనుకున్నాడు. కానీ ఇలా జరిగింది.

ఆయన గుండెల్ని చీల్చుకుంటూ ఒక నిట్టూర్పు వచ్చింది.

సరిగ్గా నాలుగున్నరకి జవహర్ ఫోన్ చేసాడు. సీత మాట్లాడింది. "అమ్మా సీతా! పవిత్ర వాళ్ళు ఉన్న ఇల్లు ఏరియా పేరు చెప్పగలవా?" ఆశగా అడిగాడు.

"అమీర్ పేట అన్నారు బాబాయ్ గారూ! మిగతా వివరాలు తెలియవు" అంది సీత.

"పోనీ శివ పని చేసే హాస్పిటల్ ఎక్కడో తెలుసా?" అడిగాడు.

"లేదు బాబాయ్ గారూ! నేను మర్నాడే వచ్చేసాను కదా! నాకేం తెలియదు" అంది.

"సరేనమ్మా" అంటూ ఫోన్ పెట్టేసాడు. ఆయన మనసులో ఆందోళన పెరిగింది.

ఎలా తెలుసుకోవడం? ఆలోచిస్తూనే పాకెట్ డైరీ తీసి తన స్నేహితుడు రాఘవకి ఫోన్ చేసి, గవర్నమెంట్ హాస్పిటల్స్ లిస్టు పంపమని అడిగాడు.

మరునాడు సాయంత్రానికి ఇస్తానని అతను చెప్పడంతో, మనసు కుదుట పరచుకుంటూ ఇంటి దారి పట్టాడు.

రాత్రి పది దాటింది. పవిత్ర వీధి తలుపు మూసేసి, లైట్లు అన్నీ ఆర్పేసి, కిటికీ దగ్గరగా కుర్చీ జరుపుకుని వీధిలోకి చూస్తూ కూర్చుంది.

మధ్యాహ్నం తిన్న అన్నం. మళ్ళీ ఏమి తినలేదు. రాత్రికి వంట చేయాలో, చేయద్దో తెలియదు. వాళ్ళు ఎక్కడన్నా తిని వస్తారో, డిన్నర్ కి వచ్చేస్తారో ఏమి తెలియదు. వంట ఏం చేయాలో, వంట చేయాలా? టిఫిన్ చేయాలా కూడా తెలియదు. అందుకే ఏమి చేయలేదు. వాళ్ళకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. ఆకలేస్తోంది. కడుపులో గాభరాగా ఉంది. మజ్జిగ చేసుకుని, గ్లాస్ లో పోసుకుని, కొంచెం, కొంచెం తాగుతూ అలా చూస్తూ కూర్చుంది.

ఆమెకి ఏడుపు వస్తోంది. భయం వేస్తోంది. ఈరోజు తల్లి,తండ్రి, నానమ్మా పదే , పదే గుర్తు వస్తున్నారు. నాన్న ఎలా ఉన్నాడో, అమ్మ ఏం చేస్తోందో! ఎలా వెళ్ళడం వాళ్ళ దగ్గరికి? శివ తనని అక్కడికి పంపిస్తాడా? నెల కూడా కాలేదు. అప్పుడే బెంగ ఏమిటి అన్నాడు.

కనీసం ఇప్పుడు , తను గర్భవతి అని తెలిసాక అయినా పంపిస్తాడేమో! వెంకటమ్మ అన్నట్టు తనకి ఇలా ఇంకా నెల వరకు వాంతులు అవుతుంటే అతను కచ్చితంగా కంగారు పడతాడు. నానమ్మ, అమ్మ దగ్గర ఉంటె బాగుంటుంది అని పంపిస్తాడేమో!

ఆలోచనల్లోనే పదిన్నర అయింది. బయట కారు ఆగిన శబ్దం వినిపించింది.

ఒక్క ఉదుటున కుర్చీ లోంచి లేచి, గబగబా వెళ్లి తలుపు తీసింది.

ముందు సరళ లోపలికి వచ్చింది. డ్రెస్ తో వెళ్ళిన ఆమె చీరతో వచ్చింది. వస్తూనే పవిత్రని "హాయ్" అంటూ పలకరించి, లోపలికి వెళ్ళింది. ఆవిడ దగ్గర నుంచి ఏదో వాసన ఘాటుగా వచ్చింది. చెంగుతో ముక్కు మూసుకుంది పవిత్ర.

కారు పార్క్ చేసి శివ వచ్చాడు. దగ్గరగా వచ్చిన పవిత్రని చూసి, "నువ్వేంటి ఇంకా పడుకోలేదా?" అనడిగాడు.

"మీకోసం ఎదురుచూస్తూన్నాను. భోజనం చేసారా?" అనడిగింది.

"ఆ, మేము తినేసాము. నువ్వు తిన్నావా?" ముద్దగా అడిగాడు. సరళ దగ్గర నుంచి వచ్చిన వాసనే అతని దగ్గరా వచ్చి, గబుక్కున వెనక్కి జరిగింది.

చెంగు ముక్కు దగ్గర పెట్టుకుని, "లేదు" అంది.

"సరే తినేసి పడుకో" అంటూ సరళ వెళ్ళిన గదివైపు వెళ్ళబోతుంటే, కంగారుగా పిలిచింది పవిత్ర. "అది మీ పిన్నిగారి గది. అటేందుకు వెళ్తున్నారు?".

ఆమె అరుపుకి జంకినట్టు అడుగులు వెనక్కి వేసి, "ఆ, ఆవును మర్చిపోయాను" అంటూ పక్కకి తిరిగాడు.

పవిత్ర అతని వెనకాలే వెళ్ళింది. "స్నానం చేస్తారా?" అడిగింది.

"ఎందుకు? " అంటూ, షర్టు విప్పి ఆమె ఇచ్చిన లుంగీ అందుకున్నాడు.

రెండు నిమిషాల్లో లుంగీ కట్టుకుని మంచం మీద వాలిపోయిన అతని వైపు వెర్రిదానిలా చూసింది.

మంచం చివర కూర్చుని "అప్పుడే నిద్ర వస్తోందా?" అంది.

"ఊ ఏం పడుకోవద్దా ?" అన్నాడు.

పవిత్ర మాట్లాడకుండా చెంగు ముక్కుకి అడ్డం పెట్టుకుని గదిలో నుంచి బయటకి వచ్చింది. మజ్జిగ తేవడానికి వంట గదిలోకి వెళ్ళబోతూ సరళ గదివైపు తొంగి చూసింది. ఆవిడ మంచం మీద అడ్డంగా పడుకుని ఉంది. చీర కూడా మార్చుకోలేదు. చీర కుచ్చిళ్ళు ఓ వైపు వాలి, పల్చటి చీరలో నుంచి పెటికోట్ కనిపిస్తోంది. పవిత్ర తలుపు జారవేసి, వంట గదిలోకి వెళ్ళిపోయి, గ్లాసులో మజ్జిగ పోసుకుని, లైట్స్ అన్నీ ఆఫ్ చేసి వచ్చింది. శివ అప్పటికే నిద్రలోకి జారుతున్నాడు. పవిత్ర అసహనంగా అతన్ని తట్టి లేపి, "మజ్జిగ తెచ్చాను తాగండి" అంది.

"వద్దు" అన్నాడు కళ్ళు తెరవకుండా .

పవిత్రకి కోపం వచ్చింది. ఎంత మంచి విషయం చెప్పాలి అనుకుంటూ ఎదురుచూసింది. ఈ మనిషి ఇలాంటి మూడ్ లో వచ్చాడు. అసలు ఇద్దరూ ఏం తాగారో! ఆవిడకి బుద్ధి ఉందా? ఎక్కడికి వెళ్లి వచ్చారు? ఉదయం వెళ్ళారు. ఈయన హాస్పిటల్ కి వెళ్ళలేదా? ఎటు తిరిగి వచ్చారు ,

కొత్తగా పెళ్లి అయి, ఇంట్లో భార్య తనకోసం ఎదురుచూస్తూ ఉంటుందన్న ఇంగితం లేదా ఈయనకి? అసలు ఆవిడ ఎందుకోచ్చినట్టు ఇక్కడికి? రకరకాల ప్రశ్నలతో ఆమెకి శ్వాస ఆడనట్టు అనిపిస్తుంటే, నిస్సహాయంగా మంచం మీద వెనక్కి జరిగి కూర్చుంది.

అతను, మత్తులోనే ఎడం చేయి జాపి ఏదో వెతుక్కుంటున్నట్టు కదుపుతూ చేతికి ఏమి తగలకపోడంతో కళ్ళు తెరిచి చూసాడు. మంచానికి వెనక్కి ఆనుకుని కూర్చున్న పవిత్రని చూస్తూ "ఏమైంది" అన్నాడు.

పవిత్ర మొహం వెలిగిపోయింది. హమ్మయ్య ఈయన నిద్రపోలేదు అనుకుంటూ, కూర్చున్నది మెల్లగా కాళ్ళు జాపి పడుకుంది. అతని మొహంలోకి చూస్తూ, "మీకు నిద్ర వస్తోందా?" అని అడిగింది.

"ఏం?" అన్నాడు.

"మీతో ఒక విషయం చెప్పాలి" అంది పవిత్ర.

'దా చెప్పు" అంటూ ఆమె చేయి పట్టుకుని మీదకు లాక్కున్నాడు.

అతని నోటి నుంచి వస్తున్న వాసనకి తట్టుకోలేక పక్కకి జారి, మంచం దిగి లైటు ఆర్పేసింది. తలుపు గడియ వేసి వచ్చి అతని పక్కన పడుకుని అడిగింది. " ఏం తిన్నారు? మీ నోట్లో నుంచి వాసన వస్తోంది"

"తింటే రాదు, తాగాను అన్నాడు."

"తాగడం అంటే! బ్రాందీ తాగారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఓ నీకు బ్రాందీ తెలుసా?"

"మా గుడివాడలో బోలెడు షాపులున్నాయి."

"అయితే ఇంకేం, ఎప్పుడన్నా రుచి చూసావా?"

"ఛీ"

"చీనా, ఇందులో ఉన్న మత్తు, గమ్మత్తు నీకేం తెలుసు? ఒక్కసారి రుచి చూపిస్తాలే". అన్నాడు.

"ఛీ, ఛీ అలాంటి పని చేయకండి. నాకు అసహ్యం"అంది.

"ఒక్కసారి తాగితే ఆ మాట అనవు." అన్నాడు ఆమెని దగ్గరకు లాక్కుంటూ.

అతని వాలకం నచ్చకపోయినా, ఆ కంపుకి కడుపులో తిప్పుతున్నా, అతనలా మీద చేయి వేయగానే, ఇతను నావాడు అనే భావన ఆమెని ముంచెత్తింది. ఇంకా కొత్త కాపురంలోని మధురమైన భావనలు మర్చిపోలేదు. ఆ తీయదనం కోసం శరీరం, మనసు తహతహ లాడుతూనే ఉంది. అతని స్పర్శ ఆమెని వివశురాలిని చేసింది.

భర్తని గుప్పిట్లో పెట్టుకోమని వెంకటమ్మ చెప్పింది కానీ, ఎలా పెట్టుకొవాలో చెప్పలేదు. చెప్పకపోయినా తెలుసుకునే గడుసుదనం ఆమెకి ఇంకా అబ్బలేదు. అందుకే, ఒక స్త్రీతో ఉదయం వెళ్ళిన భర్త, ఎక్కడికి వెళ్ళాడు? ఏం చేసాడు? తాగవలసిన అవసరం ఏమిటి? అన్న ప్రశ్నలతో అతన్ని నిలదీయాలన్న ఆలోచన ఆమెకి రాలేదు. ప్రేమించిన

భర్త స్పర్శ ఆ స్పర్శలోని తీయదనం మాత్రమే ఆమె అనుభవిస్తోంది. కాకపొతే ఆ వాసన మాత్రమే భరించలేక " ప్లీజ్ బ్రష్ చేసుకు రండి" అంది.

అతను ఏమనుకున్నాడో మంచం దిగి, బాత్ రూమ్ లోకి వెళ్ళాడు.

పవిత్ర మనసు తేలికైంది. కారణం, అతను, సరళ ఏదో పని మీద వెళ్లి ఉంటారు, వాళ్ళిద్దరికీ ఎలాంటి సంబంధం లేదు. ఉండి ఉంటె, ఉదయం నుంచి వాళ్ళు కలిసి ఉన్నాక కూడా, తనని ఎందుకు దగ్గరకు తీసుకుంటాడు? అనుకుంది.

"నా శివ నావాడు" అనుకుంది. గాలిలో తేలుతున్నట్టు అనిపించింది. ఇప్పుడు చెప్తాను. వినగానే ఎలా స్పందిస్తాడో. ఈ సమయం చాలా అనుకూలమైనది. అతని గుండెల మీద పడుకుని, అతని చెవిలో చెప్పే సందర్భం ఎంత బాగుంటుంది! అతని కోసం ఎదురుచూస్తూ సంతోషంగా అనిపించింది.

అతను టవల్ తో మొహం తుడుచుకుంటూ వచ్చి, ఆమె స్టూల్ మీద పెట్టిన మజ్జిగ తాగేసి, తిరిగి ఆమె పక్కన పడుకుని "ఇప్పుడు ఒకే కదా" అన్నాడు ఆమెని దగ్గరకు తీసుకుంటూ.

సిగ్గుగా అతని గుండెల్లో ఒదిగిపోతూ, "మీకో శుభవార్త చెప్పనా?" అంది.

"ఏంటది చెప్పు అన్నాడు" పెదాలు అందుకుంటూ.

"ఇలా అయితే ఎలా చెప్పను? ఆగండి" గోముగా అంది.

"నువ్వే ఆగు..." అంటూ ఆమెని మాట్లాడనివ్వలేదు.

అలసిపోయి అతని గుండెల మీద తల పెట్టి పడుకుని "ఇప్పుడు వింటారా?" అనడిగింది.

"నిద్ర వస్తోంది. సరేలే చెప్పు" అన్నాడు.

అతనలా నిరాసక్తంగా అడుగుతోంటే ఆమెకి చెప్పాలనిపించలేదు. ఇంత మంచి వార్త ఒక మంచి సన్నివేశంలో చెప్పాలి. మొదటిసారి తను తండ్రి కాబోతున్న వార్తని తెలుసుకున్న క్షణాలు అతని జీవితంలో, తన జీవితంలో కూడా మధురంగా ఉండి పోవాలి ... కానీ అతనికి అంత ఓపిగ్గా, తీరిగ్గా వినే సహనం లేదనిపిస్తోంది. చాలా నిరుత్సాహంగా, నిస్పృహగా అనిపించింది. మౌనంగా ఉండిపోయింది.

"చెప్పు. ఏదో చెప్తా అన్నావు" అన్నాడు.

తను మౌనం వహించాగానే అతను నిద్రలోకి జారుకుని ఉంటే ఎలా ఉండేదో పరిస్థితి, కానీ అతనలా అడగడంతో ఆమెకి ఉత్సాహం కలిగింది.

నెమ్మదిగా ఒక్కో అక్షరం పేర్చుకుంటూ చెప్పింది "మీరు ... మీరు.. నాన్న అవబోతున్నారు"

"వాట్?" గబుక్కున ఆమెని వదిలేసి, మోచేతుల మీద లేచాడు.

"ఏమైంది?" అయోమయంగా చూసింది.

"నువ్వు ఏం చెప్పావు ఇప్పుడు?"

అతనడిగిన విధానంతో ఆమెకి భయం వేసింది. తనేం తప్పు మాట్లాడిందో అర్థం కాలేదు. కొంచెం బెదురుతూ అంది. "మనం అమ్మా, నాన్న కాబోతున్నాము".

"ఎవరు చెప్పారు?"

"వె ... వెంకటమ్మ."

"వెంకటమ్మా? మొహం చిట్లించాడు.

"పొద్దున్న మీరు వెళ్ళగానే నాకు వాంతి అయిపొయింది. అది చూసి వెంకటమ్మ చెప్పింది నేను నెల తప్పాను అని. " బెదురుతూనే చెప్పింది. కానీ ఆమెకి దుఃఖం పొంగుకుని వస్తోంది. ఇంత మంచి వార్త విని ఎంత ఆనందిస్తాడో అనుకుంది. తనని అనురాగ జలధిలో ముంచేస్తాడు అని కలలు కంది. కానీ అతను తనేదో తప్పు చేసినట్టు నిలదీస్తుంటే ఏం చేయాలో అర్థం కావడం లేదు.

"మన పెళ్లి అయి ఎన్ని రోజులు?"

"ఇవాళకి నెల."

"మన శోభనం అయి?"

"ఇరవై ఎనిమిది రోజులు..."

"అతను ఆమె వైపు తదేకంగా కొన్ని క్షణాలు చూసి, మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు. ఆమె నిశ్శబ్దంగా అతన్ని గమనించసాగింది.

ఏమైంది? ఇతనికి పిల్లలు అంటే ఇష్టం లేదా?

ఉదయం నుంచీ ఈ వార్త చెప్పడానికి గుమ్మానికి కళ్ళు అతికించి మరీ ఎదురుచూసింది. అన్నం తినాలనిపించలేదు... ఏమి చేయాలనిపించలేదు. కానీ వెంకటమ్మ చెప్పిన "నెల తప్పారమ్మా మీరు. బాగా తినాల అన్న మాట తో బలవంతంగా ఏదో చేసుకుని తిన్నాను అనిపించింది.

ఎన్ని ఊహించుకుంది! పెళ్లి అయిన కొద్ది రోజులకే తను గర్భం దాల్చడం అనేది నిజంగా శుభవార్తే. గుడివాడలో ఎందరికో కాపురానికి వచ్చి నాలుగేళ్ళు, ఆరేళ్ళు దాటినా పిల్లలు కలగకపోతే గుళ్ళు, గోపురాలు తిరిగి, పూజలు చేసేవారు. గుండె బరువుగా అనిపించింది. తనని తాను నిలదొక్కుకుంటూ, అతని గుండెల మీద చేయి వేసి, దగ్గరగా జరిగి మెత్తగా, మృదువుగా అడిగింది. "మీకు బాబు కావాలా? పాప కావాలా?"

అతను ఆమె వైపు తిరిగాడు. మొహం లోకి చూస్తూ "మోహన్ ఎక్కడున్నాడు?" అని అడిగాడు.

హటాత్తుగా ఆ ప్రశ్న అడగడంతో పవిత్ర నిశ్చేష్టురాలై చూసింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS